ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 16 మే 2025

మండు వేసవిలో... మిట్ట మధ్యాహ్నం వేళ



గుక్కెడు నీటి కోసం చిన్నారుల సైతం..

తన బిడ్డలు, బిందెలతో బండి లాగుతున్న మాతృమూర్తి

చెన్నై, ఆంధ్రజ్యోతి

బృహదీశ్వరాలయంపై త్రివర్ణ కాంతులు

● 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవానికి లేజర్ లైటింగ్

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' విజయోత్సవానికి సూచికగా తంజావూరు బృహదీశ్వరాలయంపై రాత్రిపూట మువ్వన్నెల లేజర్‌కాంతులు ప్రసరింపజేస్తున్నారు. ఆ దృశ్యాన్ని చూడటానికి స్థానికులు, పర్యాటకులు రాత్రిపూట పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవం సందర్భంగా తిరుచ్చి మెయిన్ కార్డ్ గేట్, తంజావూరు బృహదీశ్వరాలయం, కన్నియాకుమారి వట్టకోటపై మువ్వన్నెల లేజర్ లైటింగ్ ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులకు భారత పురావస్తు పరిశోధనశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు బృహదీశ్వరాలయం ప్రధాన ద్వారానికి ఇరువైపులా లేజర్ కాంతులను బుధవారం రాత్రి నుండి వేస్తున్నారు. పురావస్తుశాఖ ఉన్నతాధికారుల నుంచి తదుపరి ఉత్తర్వు వచ్చేంత దాకా బృహదీశ్వరాలయం ఈ మువ్వన్నెల కాంతులతో సందర్శకులను అలరించనున్నాయని స్థానిక అధికారులు తెలిపారు.





ఫ్లవర్‌షో పూల బ్యానర్

పుష్ప సింహాసనంపై ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులు

ఊటీలో విరబూసిన గులాబీ

● పుష్ప ప్రదర్శనను ప్రారంభించిన సీఎం



రాజమహల్

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక ప్రాంతమైన పర్వతరాణి ఊటీలో గులాబీ విరబూసింది. ఊటీ బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటైన 127వ పుష్ప ప్రదర్శన గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ ఫ్లవర్‌షో ప్రారంభించారు. అదే సమయంలో రూ.24.60 కోట్లతో మరమ్మతు చేసిన ఫెర్న్‌హౌస్ కూడా ప్రారంభించారు. ప్రతియేటా వేసవిలో నీలగిరి జిల్లాల్లోని ప్రకృతి సౌందర్యాలను ఆస్వాదించడానికి వేలసంఖ్యలో దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. వారిని ఆకట్టుకునేలా బొటానికల్ గార్డెన్‌లో ఫ్లవర్‌షో నిర్వహిస్తుంటారు. ఆ మేరకు గురువారం ప్రారంభమైన 127వ ఫ్లవర్‌షోలో సుమారు 40 వేల పూలకుండీల్లో విరిసిన వివిధ రంగుల పూలను వరుసగా పేర్చారు. ఈ అందమైన పూల సొబగులను చూడటానికి వచ్చే పర్యాటకులను మైమరపించేలా రాష్ట్ర ఉద్యానవనాలశాఖ ఈ నెల 25 వరకు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది. ఈ ఫ్లవర్‌షో ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణితో కలిసి పూల సింహాసనంపై ఆశీనులై మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల అభినందనలు స్వీకరించారు. ఆ తర్వాత అదే సింహాసనంపై మంతులు ముఖ్యమంత్రితో కూర్చుని ఫొటోలు దిగారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఎంపి సామినాథన్, ప్రభుత్వ విప్ కె.రామచంద్రన్, ఎంపీ రాజా, ఎమ్మెల్యే ఆర్.గణేష్, నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మీ భవ్య తన్నీరు తదితరులు పాల్గొన్నారు. ఫ్లవర్‌షో ప్రారంభించిన తర్వాత ముఖ్యమంత్రి స్టాలిన్, సతీమణితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.

70 వేల ఆటోలకు క్యూఆర్‌కోడ్ స్టిక్కర్లు

● నిర్భయంగా మహిళల ప్రయాణం

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై ఆటోల్లో ప్రయాణించే మహిళలకు మరింత భద్రత కల్పించేలా క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నారు. గత రెండు నెలలుగా నగరంలో ఉన్న సుమారు 70వేల ఆటోల్లో క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అతికిస్తున్నారు.



మార్చిలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ మహిళా భద్రతా పథకాన్ని పరిచయం చేశారు. ఆ మేరకు ఆటోలలో క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు అతికిస్తున్నారు. ఈ స్టిక్కర్లు ఆటో డ్రైవర్ సీటు వెనుక ఉంటుంది. ఆటోలో ప్రయాణించే మహిళలు తమకు భద్రత కరువైతే, లేకుంటే లైగింక వేధింపులు జరుగుతాయనే అనుమానం ఉంటే వెంటనే ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసుకుని ఎస్ఓఎస్ అనే బటన్‌నొక్కితే వెంటనే పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఎస్ఎంఎస్ వెళుతుంది. ఆ సందేశంలో ఆటోలో ప్రయాణించే మహిళ ఏ ప్రాంతంలో వెళ్తున్నది, అక్కడికి చేరువగా ఉన్న పోలీసుస్టేషన్ తదితర వివరాలను, ఆ ఆటో ఓనర్ ఎవరనే విషయం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. ఆ వివరాల ఆధారంగా ఆటోలో ప్రయాణించే మహిళకు ఎలాంటి ఆపద కలుగకుండా హుటాహుటిన స్థానిక పోలీసులు వెళ్ళి నిరోధించగలుగుతారు. ఈ విషయమైన నగరానికి చెందిన సీనియర్ పోలీసు అధికారి ఒకరు మాట్లాడుతూ ఆటోలో అతికించే క్యూఆర్‌కోడ్ వల్ల మహిళలు నిర్భయంగా ప్రయాణించగలుగుతారని తెలిపారు. ఇదే విధంగా అద్దె కార్లలోనూ మహిళలకు భద్రత కల్పించే విధంగా క్యూఆర్‌కోడ్ స్టిక్కర్లను కూడా అతికిస్తున్నామని ఆయన వివరించారు.

పరందూరు విమానాశ్రయానికి మరో 8.5 ఎకరాలు



అడయార్, మే 15 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన పరందూరులో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం మరో 8.5 ఎకరాల మేరకు భూసేకరణ చేశారు.ఈ విమానాశ్రయాన్ని రూ.29,159 కోట్లతో నిర్మించాలని ప్రతిపాదించిన విషయం తెల్సిందే. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం పరందూరు చుట్టుపక్కల మొత్తం 13 గ్రామాల నుంచి 5300 ఎకరాలను సేకరించాలని నిర్ణయించి, ఇప్పటివరకు 3700 ఎకరాల స్థలాన్ని సేకరించారు. మిగిలిన స్థల సేకరణలో రెవెన్యూ అధికారులు నిమగ్నమైవున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మరో 8.5 ఎకరాల స్థలాన్ని సేకరించినట్టు అధికారులు వెల్లడించారు. ఇది కాంచీపురం జిల్లాలోని నెల్‌వాయ్ గ్రామంలో పరిశ్రమలు, పెట్టుబడులు ప్రోత్సాహక శాఖ తరఫున సేకరించారు. మొత్తం 196 సర్వే నంబర్లలో ఈ 8.5 ఎకరాలున్నాయి. మరోవైపు పరందూరు ఎయిర్‌పోర్టు తొలి దశ నిర్మాణ పనులు వచ్చే యేడాది జనవరి నెలలో ప్రారంభంకానున్నాయి. ఈ తొలి దశ నిర్మాణ పనులను వచ్చే 2028 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కోవైలో రౌడీ అరెస్టు



చికిత్స పొందుతున్న రౌడీ హరిశ్రీ

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపంలో నాటు తుపాకీతో కాల్చేందుకు ప్రయత్నించిన రౌడీని పోలీసులు కాల్చి నిర్బంధించారు. ఈ సంఘటనలో ఆ రౌడీ కాలికి గాయమైంది. మదుకూడం ప్రాంతంలో బుధవారం రాత్రి శక్తివేల్, శరవణంపట్టి కాఫీ కడై ప్రాంతానికి చెందిన హరిశ్రీ (23) అనే రౌడీతో కలిసి మద్యం దుకాణంలో తాగి బయటకొచ్చి గొడవ పడ్డారు. ఆ సమయంలో హరిశ్రీ తన వద్దనున్న నాటుతుపాకీతో గాలిలోకి పేల్చి భయపెట్టాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న పోలీసులు హరిశ్రీని అదుపులోకి తీసుకున్నారు. మరుసటి రోజు అతడి వద్దనున్న నాటు తుపాకీ స్వాధీనం చేసుకోవడానికి పోలీసులు ఓ ప్రాంతానికి తీసుకెళ్ళారు. అక్కడకు వెళ్ళిన తర్వాత హరిశ్రీ తాను దాచి ఉంచిన నాటుతుపాకీతో పోలీసుల పైకి కాల్చాడు. ఊహించని ఆ సంఘటనతో పోలీసులు అప్రమత్తమై హరిశ్రీ కాలిపైకి తుపాకీతో కాల్చారు. ఎడమకాలి మోకాలిలోకి తూటా దూసుకుపోవడంతో పోలీసులు హరిశ్రీని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆ నివేదికలు మాకే పంపండి

● సెర్చ్ కమిటీలకు ప్రభుత్వ ఆదేశం

ప్యారీస్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు ఉప కులపతుల నియామకానికి సంబంధించిన నివేదికను తమకే పంపించాలని సెర్చ్ కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలో 22 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలుండగా, వాటిల్లో 11 విశ్వవిద్యాలయాల్లో వీసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీసీల నియామకంలో రాష్ట్ర ప్రభుత్వానికి, గవర్నర్‌కు ఏర్పడిన విభేదాలు కొలిక్కిరాలేదు. అందువల్ల వీసీ పోస్టులు భర్తీ చేయలేని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ పదవిని సీఎంకు అప్పగించే బిల్లును అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం దీనికి అంగీకారం కోరుతూ రాజ్ భవన్‌కు పంపించగా, గవర్నర్ ఎలాంటి సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యం చూపారు. గవర్నర్ తీరును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేయగా, విచారణ జరిపిన సుప్రీంకోర్టు, రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో ఇక నుంచి రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మార్పుల కారణంగా ఉప కులపతుల పోస్టులు భర్తీ చర్యలు మొదలయ్యాయి. ఇందుకోసం 9 విశ్వవిద్యాలయాలకు అర్హులైన వారిని ఉప కులపతులుగా ఎంపిక చేసేందుకు ప్రభుత్వం సెర్చ్ కమిటీని నియమించింది. కాగా, తమిళనాడు ఉపాధ్యాయ విద్య విశ్వవిద్యాలయం, అన్నా విశ్వవిద్యాలయం, మదురై కామరాజర్ విశ్వవిద్యాలయం, అన్నామలై విశ్వవిద్యాలయాల ఉపకులపతుల నియామకానికి సెర్చ్ కమిటీ ప్రారంభించింది. ఇందులో తమిళనాడు టీచర్స్ ఎడ్యుకేషనల్ యూనివర్శిటీకి 2019 అక్టోబరు 19వ తేది, అన్నామలై వర్శిటీకి 2024 డిసెంబరు 9న, అన్నా వర్శిటీకి 2024 డిసెంబరు 13న, మదురై కామరాజర్ వర్శిటీకి 2025 జనవరి 10వ తేది సెర్చి కమిటీ నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో సెర్చి కమిటీ ఉప కులపతుల పోస్టులకు ముగ్గురితో కూడిన జాబితాను గవర్నర్‌కు పంపగా, వారిలో ఒకరిని ఉప కులపతిగా గవర్నర్ నియమించారు. ఈ నేపథ్యంలో, తాజాగా వీసీల ఎంపికకు ప్రభుత్వం నియమించిన సెర్చ్ కమిటీ తమ నివేదికను గవర్నర్‌కు కాకుండా ప్రభుత్వానికే అందజేయాలని సూచించింది.

కడలూరు సిప్కాట్‌లో ఘోరం

● బాయిలర్ ట్యాంక్ పేలి ఇళ్ళపై పడిన రసాయనాలు

● 20 మందికి తీవ్ర అస్వస్థత



ఇళ్ల చుట్టూ ప్రవహిస్తున్న రసాయనాలు, ఫ్యాక్టరీ వద్ద కాపలాకాస్తున్న కార్మికులు

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): కడలూరు సిప్కాట్ ప్రాంతంలో ఉన్న 'లాయల్ సూపర్ ఫ్యాబ్రిక్స్' అనే అద్దకపు కర్మాగారంలో రసాయన పదార్థాల బాయిలర్ ట్యాంక్ ఆకస్మికంగా పేలడంతో ఆ ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఉన్న 20కి పైగా ఇళ్లలోకి అధిక ఉష్ణోగ్రతతో కూడిన రసాయనిక ద్రవం ప్రవహించింది. దీంతో ఇళ్లలోని వారికి కళ్లు మంటలు, శరీరంపై దురదలు, వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ దుర్ఘటనలో అస్వస్థతకు గురైన 20 మందిని ఆస్పత్రులకు తరలించారు. కడలూరు సిప్కాట్ పారిశ్రామికవాడలో కుడిక్కాడు గ్రామం వద్ద అద్దకపు ఫ్యాక్టరీ ఉంది.. గురువారం వేకువజామున 2 గంటల ప్రాంతంలో ఆ ఫ్యాక్టరీలో 6 లక్షల లీటర్ల కెపాసిటీతో కూడిన బాయిలర్ ట్యాంక్‌లో రసాయనిక వ్యర్థాలు అత్యధికంగా చేరటంతో ఉన్నట్లుండి ఆ ట్యాంక్ పేలింది. ఆ ట్యాంక్‌లో నుంచి రసాయాన ద్రవాలు చుట్టుపక్కల ఉన్న ఇళ్లలోకి ప్రవేశించాయి. ఆ రసాయనిక ద్రావకం కారణంగా రెండిళ్ల గోడలు కూడా ధ్వంసమయ్యాయి. ఇళ్లలోకి ఈ రసాయన ద్రవం ప్రవేశించడంతో నిద్రపోతున్నవారికి శ్వాసకోశ సమస్యలు ఏర్పడ్డాయి. కళ్ళ మంటలు, వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన 20 మందిని చికిత్స నిమిత్తం కడలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ బాయిలర్ ట్యాంక్ పేలుడు సంఘటనపై స్పందించని అధికారుల తీరును ఖండిస్తూ స్థానికులు కడలూరు - చిదంబరం రహదారిలో ధర్నా నిర్వహించారు. సమాచారం తెలియగానే కడలూరు తహసీల్దార్ మహేష్, పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపి ధర్నా విరమింపజేశారు. కడలూరు ముత్తునగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. ఇదిలా ఉండగా కడలూరు సిప్కాట్‌లో ప్రైవేటు ఫ్యాక్టరీ బాయిలర్ ట్యాంక్ పేలుడు కారణంగా వందకు పైగా ఇళ్లు దెబ్బతిన్నాయని, ఆ ఇళ్ల యజమానులకు ప్రభుత్వం భారీగా నష్టపరిహారం చెల్లించాలని పీఎంకే నేత డాక్టర్ అన్బుమణి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

డెల్టా జిల్లాల్లో ఈదురు గాలులతో భారీ వర్షం



→ పుదుకోట జిల్లా పల్లత్తివిడుది గ్రామంలో పెనుగాలులకు ధ్వంసమైన అరటి తోటలను పరిశీలిస్తున్న మంత్రి సీవీ మెయ్యనాథన్

అడయార్, మే 15 (ఆంధ్రజ్యోతి): కావేరీ డెల్టా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అండమాన్ సముద్రతీరంపై బాహ్య ఉపరితల ద్రోణి ప్రభావం కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా కోస్తాతీర జిల్లాల్లో విస్తారంగా కురుస్తున్నాయి. బుధవారం రాత్రి మైలాడుదురైలో వర్షం కురిసింది. అలాగే, నాగపట్టణం జిల్లాలో అర్ధరాత్రి సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. తిరువారూరు జిల్లాలోని నన్నిలం, నీటామంగళం, మన్నార్‌కుడి, తిరుత్తురైపూండి చుట్టుపక్కల ప్రాంతాల్లో విస్తారంగా వర్షం కురిసింది. కరూర్‌లో రాత్రి 8 గంటల నుంచి 9 గంటల వరకు ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవగా, పుదుక్కోట జిల్లాలో తిరుమయం, అరిమలం తదితర ప్రాంతాల్లో కూడా భారీగా వర్షం పడింది.. తిరుచ్చి నగరంలో రాత్రి 7 గంటల సమయంలో ఉన్నట్టుండి భారీ వర్షం కురిసింది. అలాగే, మిగిలిన డెల్టా జిల్లాల్లో కూడా వర్షం కారణంగా అనేక లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు వచ్చి చేరింది.

ఢిల్లీ వెళ్లిన గవర్నర్



చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): బిల్లుల ఆమోదంపై గవర్నర్‌కు కాలపరిమితి నిర్దేశించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా అంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుప్రీంకోర్టును ప్రశ్నించిన నేపథ్యంలో గవర్నర్ ఆర్ఎన్ రవి గురువారం హుటాహుటిన ఢిల్లీ వెళ్లారు. గవర్నర్‌తో పాటు ఆయన సతీమణి, కార్యదర్శి, భద్రతాధికారి కూడా ఉన్నారు. ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో పాటు పలువురు కేంద్రమంత్రులతో గవర్నర్ భేటీ కానున్నట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో పాటు సుప్రీంకోర్టు తీర్పుపైనా కేంద్రమంత్రులతో చర్చించనున్నట్లు సమాచారం.

సమాచార దృశ్ని

గ్రూప్-2, 2ఏ ప్రిలిమినరీ ఫలితాల విడుదల

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2, 2ఏ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షా ఫలితాలను టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. 534 గ్రూప్-2 పోస్టులు, 2,006 గ్రూప్-2ఏ పోస్టుల భర్తీకి గత ఏడాది జూన్‌లో టీఎన్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టుల భర్తీ ప్రిమిలినరీ, మెయిన్స్ పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఈ పరీక్షలకు 5.80 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రిమిలినరీ ప్రథమ శ్రేణి పరీక్ష ఫిబ్రవరి 8, ద్వితీయ శ్రేణి పరీక్ష 23వ తేది నిర్వహించారు.ఈపరీక్షా ఫలితాలు www.tnpsc.in అనే వెబ్‌సైట్‌లో విడుదల చేశారు.

నేటినుంచి ఏర్కాడుకు ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): పేదల ఊటీగా పిలిచే సేలం జిల్లా ఏర్కాడులో ఈ నెల 23 నుంచి వేసవి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఏర్కాడుకు వెళ్లే ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) సేలం డివిజన్ ప్రత్యేక టూర్ ప్యాకేజీ అందజేస్తోంది. సేలం కొత్త బస్టాండ్ నుంచి ఉదయం 8, 8.30 గంటలకు ప్రత్యేక బస్సులు ఏర్కాడు వెళ్లనున్నాయి. ఈ బస్సుల్లో కరడియూర్ వ్యూ పాయింట్, సేర్వరాయన్ ఆలయం, మంజుకుట్టై వ్యూ పాయింట్, పకోడా పాయింట్, లేడీస్ సీట్, మెన్స్ సీట్, రోజ్ గార్డెన్, ఏర్కాడు లేక్, అన్నా పార్క్, జింకల పార్క్, బొటానికల్ గార్డెన్ తదితర 11 ప్రాంతాలు చూడవచ్చు. ఈ పర్యాటక ప్రాంతాలు వీక్షించి రాత్రి 7 గంటలకు ప్రత్యేక బస్సులు సేలం చేరుకుంటాయి. ఈ బస్సుల్లో పెద్దలకు రూ.300, పిల్లలకు రూ.150 ఛార్జీగా నిర్ణయించారు. ఈ బస్సుల్లో ప్రయాణించేందుకు ఆసక్తి ఉన్న వారు www.tnstc.in అనే వెబ్‌సైట్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

'నమక్కు నామే' పథకానికి రూ.150 కోట్లు

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేలా 'నమక్కు నామే' పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకంలో మూడింట ఒక భాగం ప్రజలు, ప్రైవేటు సంస్థలు అందించాల్సి ఉంటుంది. ఈ పథకంలో పాఠశాల భవనాలు, ల్యాబ్, ప్రహరీ గోడలు, వంట గది, ప్రభుత కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఆడిటోరియంలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రేషన్ దుకాణాలు, లైబ్రరీలు, అంగన్వాడీ కేంద్రాలకు అదనపు భవనాలు తదితర పనులు చేపడుతుంటారు. ఈ పథకానికి ప్రతి ఏడాది రూ.100 కోట్లు కేటాయిస్తుండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రూ.150 కోట్లు విడుదల చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి గగన్‌దీప్‌సింగ్ బేదీ ఉత్తర్వులు జారీచేశారు.

విల్లుపురం-తిరుపతి ఎక్స్‌ప్రెస్ పాక్షిక రద్దు

ప్యారీస్, మే 15 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా విల్లుపురం-తిరుపతి మధ్య నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలు పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ మేరకు తిరుచ్చి రైల్వే డివిజన్ కార్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో గుంతకల్ డివిజన్ పరిధిలో పలు విభాగాల్లో మరమ్మతులు జరుగుతున్నాయని, అందువల్ల విల్లుపురం-తిరుపతి మధ్య నడుపుతున్న రైలు వేళల్లో మార్పు చేసినట్లు తెలిపింది. విల్లుపురం నుంచి ఉదయం 5.40 గంటలకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18,20,21,22,25,27,28,29, జూన్ 1,3 తేదీల్లో తిరుపతికి బదులు కాట్పాడి వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, మరుమార్గంలో తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు విల్లుపురం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులు కాట్పాడి నుంచి బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.

జమ్ము, శ్రీనగర్‌కు విమాన సేవలు పునఃప్రారంభం

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): నగరం నుంచి శ్రీనగర్, జమ్ము, చండీఘడ్ నగరాలకు విమాన సేవలు ప్రారంభమయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి అనంతరం దేశ సరిహద్దుల్లోని నగరాలకు ఈ నెల 7వ తేది నుంచి విమానసేవలు రద్దు చేశారు. ప్రస్తుతం యుద్ధవాతావరణం సద్దుమణగడంతో ఆ నగరాలకు 8 రోజుల అనంతరం విమాన సేవలు పునఃప్రారంభం కావడంతో, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంజనీరింగ్ కోర్సులకు 1.39 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సులకు ఎనిమిది రోజుల్లో 1.39 లక్షల మంది దరఖాస్తు చేశారు. రాష్ట్రంలోని 440 ప్రభుత్వ, ప్రైవేటు, డీమ్డ్ వర్శిటీ కళాశాలల్లో బీఈ, బీటెక్ కోర్సుల్లో సుమారు 2 లక్షలకు పైగా సీట్లున్నాయి. 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్ల దరఖాస్తు స్వీకరణ ఈ నెల 7వ తేది ప్రారంభమైంది. విద్యార్థులు www.tneaonline.org అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఆ ప్రకారం, బుధవారం సాయంత్రం వరకు 1,39,262 మంది దరఖాస్తులు సమర్పించగా, వారిలో 74,971 మంది విద్యార్థులు ఫీజులు చెల్లించగా, 39,844 మంది సర్టిఫికెట్లు నమోదుచేశారు. ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్ల దరఖాస్తు స్వీకరణకు చివరి తేది జూన్ 6వ తేదిగా అన్నా విశ్వవిద్యాలయం ఇదివరకే ప్రకటించింది.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌పీఎస్సీ, ఎస్ఎస్ఎస్సీ, ఐబీపీఎస్, ఆర్‌ఆర్‌బీ తదితర పోటీ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.... పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆరు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని తెలిపింది. పని దినాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన 2025 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు పూర్తయిన వారు ఈ శిక్షణకు హాజరుకావచ్చు. ఆసక్తి కలిగిన వారు www.cecc.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 044-259564905, 044-28510537 అనే నెంబర్లు సంప్రదించవచ్చని సచివాలయం ప్రకటనలో తెలిపింది.

బస్సు ఢీకొని 18 ఆవుల మృతి



మృతిచెందిన ఆవులు

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సు ఢీకొని 18 ఆవులు మృతిచెందిన ఘటన తేని జిల్లాలో చోటుచేసుకుంది. దేవారం ప్రాంతానికి చెందిన సురిళిస్వామి వందకు పైగా ఆవులను సంరక్షిస్తున్నాడు. ఇందుకోసం తోట అద్దెకు తీసుకుని పాకలు వేసి అందులో ఆవులను పెంచుతున్నాడు. ఈ క్రమంలో, బుధవారం అర్ధరాత్రి టి.కల్లిపట్టి ప్రాంతంలోని దిండుగల్ బైపాస్ రోడ్డు సమీపంలో ఆవులను దాటిస్తున్న సమయంలో ప్రభుత్వ బస్సు ఆవులను ఢీకొంది. ఈ ఘటనలో 18 ఆవులు ఘటనా స్థలంలోనే మృతిచెందగా, మరో 20 ఆవులకు గాయాలయ్యాయి. ఆవులు ఢీకొనడంతో ప్రభుత్వ బస్సు ముందు భాగం కూడా దెబ్బతినగా, ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆవుల కళేబరాలను తొలగించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు బస్సు డ్రైవర్ అళగర్‌స్వామిపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్లు

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ ఉత్తీర్ణులైన విద్యార్థులు పాలిటెక్నిక్ రెండో సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని సాంకేతిక విద్య డైరెక్టరేట్ ఒక ప్రకటనలో తెలిపింది. 2025-26వ విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరంలో చేరేందుకు టెన్త్ ఉత్తీర్ణులై వారు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అలాగే, పాలిటెక్నిక్ రెండవ సంవత్సరం అడ్మిషన్లు కూడా చేపట్టారు. గతంలో, ప్లస్ టూలో మ్యాథ్స్, సైన్స్ పాఠ్యాంశాలుగా ఉన్న విద్యార్థులు మాత్రమే పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో చేరేందుకు అర్హులు. కాగా, ఈ ఏడాది నుంచి ఆ నిబంధన సడలించి, ప్లస్ టూలో కామర్స్ సహా అన్ని గ్రూపుల విద్యార్థులకు అడ్మిషన్ కల్పించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు https://www.tnpoly.in అనే వెబ్‌సైట్ ద్వారా, జిల్లా సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించవచ్చని సాంకేతిక విద్య డైరెక్టరేట్ తెలియజేసింది.

పోలీస్‌స్టేషన్‌కు కొత్త వాహనం



పోలీస్ స్టేషన్‌కు అందజేసిన బొలేరో వాహనం

తిరుత్తణి, మే 15 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి పోలీస్ స్టేషన్‌కు కొత్త వాహనం అందజేశారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి-1 పోలీస్ స్టేషన్ పరిధిలో 90 గ్రామాలు, తిరుత్తణి పట్టణం, మురుగన్ ఆలయం తదితరాలున్నాయి. ఈ స్టేషన్ 2023-24లో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా ఎంపికై, 2025 రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ చేతుల మీదుగా సీఐ మదియరసన్ పురస్కారం అందుకున్నారు. ఈ క్రమంలో, స్టేషన్ పరిధిలో గస్తీ నిర్వహణకు 15 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన వాహనం వినియోగిస్తున్నారు. ప్రస్తుతం కొత్త బొలేరో వాహనాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది.

నేడు పీఎంకే జిల్లా నేతల సమావేశం

వాషర్‌మెన్‌పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): పీఎంకే జిల్లా అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు విల్లుపురం తైలాపురంలో జరుగుతుందని ఆ పార్టీ వ్యవస్థాపకులు డా.రాందాస్ తెలిపారు. పీఎంకే తొలి చైత్ర పౌర్ణమి యువజన మహానాడు 2013లో జరిగింది. 12 ఏళ్ల అనంతరం ఈ నెల 11న మహాబలిపురం సమీపంలో మహానాడు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మహానాడులో పాకిస్తాన్ దాడిలో మృతిచెందిన వాకిఇ నివాళులర్పించడంతో పాటు 14 తీర్మానాలు ఆమోదించారు. ఈ నేపథ్యంలో, మహానాడులో చేసిన తీర్మానాలు, భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించేందుకు శుక్రవారం తైలాపురంలో జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శుల సమావేశం నిర్వహిస్తున్నట్లు రాందాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

పోలీసు అధికారులకు రైఫిల్ షూటింగ్ శిక్షణ



షూటింగ్ శిక్షణలో అధికారులు

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖలో పనిచేస్తున్న అధికారులకు ఏడాదికి ఒకసారి రైఫిల్ షూటింగ్ శిక్షణ ఇస్తుంటారు. ఆ ప్రకారం, తిరునల్వేలి నగర పోలీసు అధికారులకు బుధవారం సేరంమహాదేవి తుపాకి శిక్షణా కేంద్రంలో శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో నగర అసిస్టెంట్ కమిషనర్లు, ఎస్ఐలు పాల్గొని డబుల్ బారల్ గన్, పిస్టల్ షూటింగ్‌లో పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమిలోనే ఉన్నాం...!

● ఓపీఎస్

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమిలో తామున్నామని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం తెలిపారు. నగరంలో గురువారం ఓపీఎస్ మీడియాతో మాట్లాడుతూ... ఇటీవల నగరానికి వచ్చిన కేంద్ర మంత్రి అమిత్‌షా తమను కలుసుకోకపోవడం బాధాకరమన్నారు. కూటమిలో ఎవరెవరున్నారు అనే విషయమై ఎలాంటి ఆందోళన లేదన్నారు. త్వరలో జిల్లాల వారీగా పర్యటించి నేతలు, కార్యకర్తల అభిప్రాయం తీసుకోనున్నట్లు తెలిపారు. అన్నాడీఎంకేకు రెండాకుల చిహ్నం కేటాయించడం తాత్కాలికమేనన్నారు. ఈరోడ్ తూర్పు ఉప ఎన్నికల సందర్భంగా అన్నాడీఎంకే రెండాకుల చిహ్నాన్ని తాత్కాలికంగా ఇచ్చారని తెలిపారు. ఎవరు అంగీకరించినా, అంగీకరించకపోయినా తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని ఓపీఎస్ స్పష్టం చేశారు.

8 వేల ఏళ్లనాటి రాతి పనిముట్లు లభ్యం



లభ్యమైన పనిముట్లు

ప్యారీస్, మే 15 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా బన్రూటి సమీపంలో సుమారు 8 వేల ఏళ్ల నాటి పురాతన రాతి పనిముట్లు లభ్యమైనట్లు పురావస్తు పరిశోధన శాఖ నిపుణులు తెలిపారు. కడలూరు జిల్లా దక్షిణ ప్రాంతంలో ఉన్న మరుంగూర్, పాలకొల్లై, వట్టప్పన్‌కుప్పం, భద్రకోత తదితర గ్రామాల్లో పురావస్తు శాఖ తవ్వకాల్లో విద్యార్థులు, నిపుణులు పాల్గొంటున్నారు. ఈ తవ్వకాల్లో తాజాగా ఉళుందంపట్టు దక్షిణ పెన్నా నది తీరంలో లభ్యమైన రాతి పనిముట్టు ఎత్తు 2.5 సెం.మీ, పొడవు 2 సెం.మీ అని, దీంతో జంతువుల చర్మం ఒలిచేందుకు వినియోగిస్తుంటారు. 8 వేల ఏళ్లనాటి రాతి పనిముట్టు గురించి పురావస్తు శాఖ పరిశోధకులు శివరామకృష్ణన్ మీడియాకు వివరిస్తూ... రాతియుగం నాటి ప్రజలు క్రూర జంతువులను వేటాడుతుండేవారని, వారు అప్పట్లో అందుబాటులో ఉన్న రాళ్లతో ఆయుధాలు తయారుచేసి వినియోగిచేవారని, ఇవి చూసేందుకు చిన్నవిగా ఉన్నా, పదునుగా ఉంటాయని తెలిపారు. ఈ అరుదైన పనిముట్లు తవ్వకాల్లో లభ్యమవుతున్నాయని, వీటిని భద్రపరిచేందుకు ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో నేరాలు పెరుగుతున్నాయి

● బీజేపీ అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్



మీడియాతో నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఏడాది కంటే ఈ సంవత్సరం నేరాల సంఖ్య బాగా పెరిగిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. తిరుచ్చిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... శాంతిభద్రతలు క్షీణించిన కారణంగా రాష్ట్రంలో ప్రతి రోజు నేరాలు పెరుగుతున్నాయని, వాటి అదుపుచేసేందుకు పోలీసు శాఖ విఫలమైందన్నారు. మాదకద్రవ్యాల విక్రయాలు బహిరంగంగా జరుగుతున్నాయని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అన్నామలైకు బీజేపీ అధిష్ఠానం త్వరలోనే కొత్త పదవి అప్పజెప్పనుందని ఆయన పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ టాయిలెట్లలో నేరస్తులు మాత్రమే పడిపోతున్నారా....?

● ప్రశ్నించిన మద్రాసు హైకోర్టు

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లలో ఉన్న టాయిలెట్లలో నేరస్తులు మాత్రమే పడిపోయేలా ఉన్నాయా? అంటూ మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. ఓ కేసులో అరెస్టయి జైలులో ఉన్న కాంచీపురానికి చెందిన జాకీర్ హుస్సేన్ చేతులు, కాళ్లు విరిగాయని, అతడికి చికిత్స చేయించేలా ఉత్తర్వులు జారీచేయాలంటూ అతని తండ్రి ఇబ్రహీం మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తులు జీఆర్ స్వామినాథన్, లక్ష్మీనారాయణన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. అరెస్ట్ చేసిన వ్యక్తి ఎలా గాయపడ్డాడు అని ధర్మాసనం. ప్రశ్నించింది. టాయిలెట్‌లో జారిపడడంతో గాయం ఏర్పడినట్లు ప్రభుత్వ తరపు న్యాయవాది తెలిపారు. ప్రభుత్వ వివవరణపై అసంతృప్తి వ్యక్తం చేసిన ధర్మాసనం... పోలీస్ స్టేషన్లలో ఉన్న టాయిలెట్లలో నేరస్తులు మాత్రమే పడి గాయాలు ఏర్పడేలా ఉన్నాయా? ఆ టాయిలెట్లను ఇన్‌స్పెక్టర్లు వినియోగించడం లేదా? వారికి ఎలాంటి గాయాలు కావడం లేదు కదా? అంటూ ప్రశ్నించింది. ఇలాంటి చర్యలకు స్వస్తి పలకాలని సూచించిన ధర్మాసనం, సంబంధిత పోలీసులను విధుల నుంచి తొలగించే పరిస్థితి వస్తుందని హెచ్చరించింది. అనంతరం పిటిషనర్‌కు చెన్నై రాజీవ్ గాంధీ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించాలని ఆదేశించిన ధర్మాసనం, కేసు విచారణ ముగిసినట్లు ఉత్తర్వులు జారీచేసింది.

స్టెరిలైట్ కర్మాగారం ప్రారంభించే ప్రసక్తే లేదు

● ఎంపీ కనిమొళి

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్టెరిలైట్ కర్మాగారం ప్రారంభించాలని పలువురు తనకు వినతిపత్రాలు సమర్పించాలని, కానీ, కర్మాగారాన్ని మూసివేయాలనే ప్రభుత్వ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని డీఎంకే ఎంపీ కనిమొళి స్పష్టం చేశారు. తెన్‌కాశి జిల్లా శంకర్‌కోయిల్‌లో గురువారం ఎంపీ కనిమొళి మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో నాలుగేళ్ల డీఎంకే పాలనలో విద్య, ఉపాధి, క్రీడలు సహా పలు రంగాల్లో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. గతంలో ప్రకటించిన అంశాలను మళ్లీ పునరాలోచించే అవసరం ప్రభుత్వానికి లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల ఫలితాలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పునరావృత్తం కానున్నాయని, అందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ కనిమొళి తెలిపారు.

అడయార్ నది ఒడ్డున ఆక్రమణల తొలగింపు

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): అనకాపుత్తూరు వద్ద అడయార్ నది ఒడ్డున జల వనరుల శాఖకు చెందిన స్థలాలను ఆక్రమించి ఇళ్లను నిర్మించుకున్న 600 కుటుంబాలకు అధికారులు పోలీసుల సాయంతో తొలగించారు. జల వనరుల శాఖ ఉన్నతాధికారులు కొన్నేళ్ల క్రితం ఆ ప్రాంతంలో అడయార్ నది ఒడ్డున స్థలాలను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న విషయాన్ని గుర్తించి అక్కడి నివాసులకు నోటీసులిచ్చారు. అయితే ఆ ప్రాంతంలో నివసిస్తున్నవారంతా కోర్టును ఆశ్రయించడంతో తొలగింపు పనులు ఆగిపోయాయి. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత కోర్టు జలవనరుల శాఖకు అనుకూలంగా తీర్పునిచ్చింది. అనకాపుత్తూరు వద్ద అడయార్ నది ఒడ్డున ఆక్రమించుకుని ఇళ్లను నిర్మించుకున్నవారినందరినీ తొలగించాల్సిందేనంటూ ఉత్తర్వు జారీ చేసింది. దీంతో అధికారులు పోలీసుల భద్రత నడుమ 600 కుటుంబాలను ఆ ప్రాంతం నుండి పంపించారు.

మూడు జలాశయాల వద్ద నేడు మాక్ డ్రిల్

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నైకి తాగునీరు అందించే పూండి, చెంబరంబాక్కం, రెడ్‌హిల్స్, చోళవరం జలాశయాల్లో శుక్రవారం సాయంత్రం మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఈ జలాశయాల నుంచి భారీగా నీరు విడుదల చేసిన తరుణంలో, సమీపంలో ప్రాంతాలు ముంపునకు గురవుతుంటారు. అలాంటి పరిస్థితులు ఏర్పడితే ముంపు ప్రాంతాల ప్రజలను ఎలా రక్షించాలి అనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. మాత్తూర్ బాలసుబ్రమణి నగర్, సడయాన్‌కుప్పం, కాసునగర్, కాశి థియేటర్ సమీపంలోని వంతెన, పోరూర్, కోట్టూరుపురం ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్న మాక్ డ్రిల్‌లో రెవెన్యూ, జలవనరులు, పోలీసు, గ్రామీణాభివృద్ధి సహా పలు శాఖల అధికారులు పాల్గొననున్నారు. ఈ మాక్ డ్రిల్ ప్రజలకు అవగాహన కల్పించేందుకు మాత్రమేనని, ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

రేపు సెంట్రల్-సూళ్లూరుపేట మధ్య సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు మార్గంలోని పొన్నేరి-కవరపేట మధ్య మరమ్మతుల కారణంగా శనివారం 21 సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ● చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 10.30, 11.35, మధ్యాహ్నం 1.40 గంటలకు గుమ్మిడిపూండి వెళ్లే సబర్బన్ రైళ్ల రద్దు. అలాగే, గుమ్మిడిపూండి నుంచి మధ్యాహ్నం 1, 3.45 గంటలకు చెన్నై సెంట్రల్‌కు వెళ్లే రైళ్ల రద్దు.

● చెన్నై సెంట్రల్ నుండి ఉదయం 5.40, 10.15, మధ్యాహ్నం 12.10 గంటలకు సూళ్లూరుపేట వెళ్లే సబర్బన్ రైళ్ల రద్దు. అలాగే, సూళ్లూరుపేట నుండి మధ్యాహ్నం 12.35, 1.15, 3.10 గంటలకు చెన్నై సెంట్రల్ వెళ్లే రైళ్ల రద్దు.

● చెన్నై బీచ్ నుంచి మధ్యాహ్నం 12.40, 2.40 గంటలకు గుమ్మిడిపూండి వెళ్లే రైళ్ల రద్దు. అలాగే, గుమ్మిడిపూండి నుంచి మధ్యాహ్నం 2.30, 3.15, సాయంత్రం 4 గంటలకు చెన్నై బీచ్‌కు వెళ్లే రైళ్ల రద్దు. ● సూళ్లూరుపేట నుంచి ఉదయం 8.10 గంటలకు నెల్లూరు వెళ్లే మెము రైలు, నెల్లూరు నుంచి ఉదయం 1.20 గంటలకు సూళ్లూరుపేటకు వెళ్లే రైళ్ల రద్దు. అలాగే, ఆవడి నుంచి ఉదయం 4.25 గంటలకు చెన్నై సెంట్రల్ వెళ్లే సబర్బన్ రైలు రద్దు.

ప్రత్యేక రైళ్లు....

సబర్బన్ రైళ్లు రద్దు చేసిన నేపథ్యంలో, ప్రయాణికుల సౌకార్యర్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. ఆ ప్రకారం, పొన్నేరి నుంచి మధ్యాహ్నం 1.18 గంటలకు చెన్నై సెంట్రల్, పొన్నేరి నుంచి సాయంత్రం 4.47 గంటలకు చెన్నై బీచ్, చెన్నై సెంట్రల్ నుండి ఉదయం 10.30 గంటలకు పొన్నేరి, చెన్నై సెంట్రల్ నుంచి ఉదయం 11.15, మధ్యాహ్నం 1.40, చెన్నై బీచ్ నుంచి మధ్యాహ్నం 2.40 గంటలకు పొన్నేరి, మీంజూరు నుండి మధ్యాహ్నం 3, 4.14 గంటలకు చెన్నై సెంట్రల్, చెన్నై బీచ్ నుంచి మధ్యాహ్నం 12.40 గంటలకు ఎన్నూర్, ఎన్నూర్ నుంచి చెన్నై సెంట్రల్‌కు మధ్యాహ్నం 3.56 గంటలకు ప్రత్యేక సబర్బన్ రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ఏనుగు దాడిలో యువకుడి మృతి

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏనుగు దాడిలో యువకుడు మృతిచెందగా, మరో యువకుడికి గాయలయ్యాయి. కోయంబత్తూర్ జిల్లా వైదేహి జలపాతం సమీపంలో కొద్దిరోజులుగా ఓ ఏనుగు సంచరిస్తోంది. ఆ జలపాతం దగ్గరకు వెళ్లే పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో, పూలువపట్టికి చెందిన సురేష్ అభిమన్యు (33) స్నేహితుడితో కలసి ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి 11.30 గంటల ప్రాంతాలో వైదేవి జలపాతం రోడ్డులో వెళుతుండగా, రోడ్డు పక్కన పొదల నుంచి వచ్చిన ఏనుగు, ద్విచక్రవాహనాన్ని తొండంతో చుట్టి విసిరేసింది. ఈ ఘటనలో తీవ్రగాయాలతో అభిమన్యు మృతిచెందాడు. సమాచారం అందుకున్న అటవీ సిబ్బంది అక్కడకు చేరుకుని, క్షతగాత్రుడిని ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పెట్రోల్ బాంబు దాడిలో బాలికకు గాయాలు

వాషర్‌మెన్‌పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై ఆరణి సమీపంలో మహిళపై వేసిన పెట్రోల్ బాంబు బాలిక మీద పడడంతో గాయాలయ్యాయి. చిన్నప్ప-చిన్నపాపకు మధ్య పాతకక్షలుండగా, గురువారం ఉదయం చిన్నపాపపై చిన్నప్ప పెట్రోల్ బాంబ్ విసిరాడు. ఆ సమయంలో పెట్రోల్ బాంబు పొరపాటున అక్కడ ఆడుకుంటున్న చిన్నపాప మనవరాలిపై పడడంతో ఆమెకు గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు, పరారైన చిన్నప్ప కోసం గాలిస్తున్నారు.

దంపతుల ఆత్మహత్య



దివ్య, ప్రతాప్ (ఫైల్‌ఫొటో)

వాషర్‌మెన్‌పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల గర్భిణి ఆత్మహత్యకు పాల్పడగా, ఈ విషయం విని తట్టుకోలేక భర్త కూడా ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిరువణ్ణామలై జిల్లాలో చోటుచేసుకుంది. వందవాసి సమీపం విళుదుపట్టు గ్రామానికి చెందిన వేలు కుమార్తె దివ్య (19), తళుతాలై గ్రామానికి చెందిన చెల్లప్పన్ కుమారుడు ప్రతాప్‌ను వివాహం చేసుకుంది. ప్రస్తుతం దివ్య నాలుగు నెలల గర్భంతో ఉంది. పదిరోజుల క్రితం కన్నవారింటికి వచ్చిన దివ్య, ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సమాచారం తెలుసుకున్న ప్రతాప్ విషం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చుట్టుపక్కల వారు అతడిని వందవాసి ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం చెంగల్పట్టు ప్రభుత్వ వైద్యకళాశాలకు తరలించారు. అక్కడ చికిత్సలు ఫలించక బుధవారం ప్రతాప్ మృతిచెందాడు. ఈ ఘటనపై వందవాసి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

18న చేపల వేటపై నిషేధం

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి) ఆంధ్ర రాష్ట్రం శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష కేంద్రం నుండి ఈ నెల 18వ తేది ఉదయం 6.59 గంటలకు పీఎస్ఎల్వీ, సి-61/ఈఓఎస్.09' రాకెట్ ప్రయోగించనున్నారు. శ్రీహరికోట ల్యాంచ్ ప్యాడ్ సమీపంలో తిరువళ్లూర్ జిల్లాలోని మత్స్యకార గ్రామాలున్నాయి. రాకెట్ ప్రయోగం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టిన, జిల్లా యంత్రాంగం, ఆదివారం జిల్లాలోని జాలర్ల గ్రామాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లడంపై నిషేధం విధిస్తూ మత్స్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

మెట్రో రైల్వేస్టేషన్లలో ఫీడింగ్ రూమ్స్

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెట్రో రైల్వేస్టేషన్లలో ఫీడింగ్ రూమ్స్ ఏర్పాటు చేసినట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. పసికందులతో మెట్రోరైళ్లలో ప్రయాణించే మహిళలు పిల్లలకు పాలిచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే నగరంలోని బస్టాండ్లలో ప్రత్యేక ఫీడింగ్ రూమ్‌లను మెట్రో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఏర్పాటుచేసింది. ఈ నేపథ్యంలో, ఇదివరకే చెన్నై సెంట్రల్ మెట్రో రైల్వేస్టేషన్‌లో ఫీడింగ్ రూమ్ ఏర్పాటుచేసి, ప్రస్తుతం ప్రధాన రైల్వేస్టేషన్లలో ఫీడింగ్ రూమ్‌లు ఏర్పాటుచేసినట్లు సీఎంఆర్ఎల్ తెలియజేసింది.

జన్మదిన వేడుకల్లో అపశ్రుతి

భోజనం చేసిన 28 మందికి అస్వస్థత ● ఒకరి మృతి

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): జన్మదిన వేడుకల్లో భోజనం చేసిన 28 మంది అస్వస్థతకు గురికాగా, వారిలో ఒకరు మృతిచెందారు. పుదుకోట జిల్లా ఆవుడయార్‌కోయిల్ ప్రాంతంలో బుధవారం రాత్రి జరిగిన జన్మదిన వేడుకల్లో బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు. వేడుకల్లో కట్ చేసి కేక్. మాంసాహార భోజనం ఏర్పాటు చేశారు. భోజనం చేసిన కొద్దిసేపటికే పలువురు వాంతులు చేసుకున్నారు. చుట్టుపక్కల వారు వీరిని వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో కరుపయ్య (60) చికిత్స ఫలించక మృతిచెందగా, చికిత్స పొందుతున్న 28 మందిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఆహార భద్రతా శాఖ అధికారులు కార్యక్రమం నిర్వహించిన ప్రాంతానికి చేరుకుని భోజన శాంపిల్స్ సేకరించి ల్యాబ్ పంపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు టీవీకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, మే 15 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) జిల్లా కార్యదర్శుల సమావేశం శుక్రవారం జరుగనుంది. ఈ మేరకు పార్టీ విడుదల చేసిన ప్రకటనలో... పనయూరులోని పార్టీకార్యాలయంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరుగనుంది.సమావేశానికి బూత్ కమిటీల నిర్వాహకుల జాబితా తీసుకురావాలని జిల్లా కార్యదర్శులకు సూచించారు. కాగా, ఈ సమావేశంలోపార్టీ అధ్యక్షుడు విజయ్ పాల్గొనే అవకాశముందని సమాచారం.

రక్షణ కోరిన సినీ నటి గౌతమి

అడయార్, మే 15 (ఆంధ్రజ్యోతి): తనకు రక్షణ కల్పించాలని సినీ నటి గౌతమి నగర పోలీస్ కమిషనర్‌ను వినతిపత్రం సమర్పించారు. అందులో ఈసీఆర్ రోడ్డులో రూ.9 కోట్ల విలువ చేసే స్థలాన్ని తన వద్ద పనిచేసిన అళగప్పన్ అనే వ్యక్తి మోసం చేసి ఆక్రమించుకుని, చట్టవ్యతిరేకంగా పక్కా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై తానిచ్చిన ఫిర్యాదు మేరకు అళగప్పన్‌తో సహా ఆయన కుటుంబ సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు ఆదేశాల మేరకు నిర్మాణ పనులు చేపట్టకుండా సీల్ కూడా వేశారనీ, ఈ నేపథ్యంలో తనను కొందరు 'న్యాయవాదులు అనే పేరుతో కొందరు వాట్సాప్ ద్వారా బెదిరిస్తున్నారు. అందువల్ల వారిపై చర్యలు తీసుకుని, తనకు తగిన భద్రత కల్పించాలి' అని గౌతమి ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఓట్టేరిలో ముగ్గురు రౌడీల అరెస్టు

అడయార్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓట్టేరిలో ముగ్గురు రౌడీలను నగర పోలీసుల అరెస్టు చేశారు. ఒట్టేరి చంద్రయోగి సమాధి వీధికి చెందిన ప్రవీణ్ కుమార్ (28) అనే వ్యక్తి పాదాచారులు, వాహనదారులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నట్టు పోలీసులకు ఫిర్యాదులందాయి. దీంతో ఆ ప్రాంతంలో నిఘా వేసిన పోలీసులు.. ప్రవీణ్ కుమార్‌ను అరెస్టు చేశారు. ఈయనపై 11 కేసులున్నట్టు విచారణలో తేలింది. అతడిచ్చిన సమాచారం మేరకు కొళత్తూరు శివశక్తి నగర్‌కు చెందిన ఆనంద్ (30), అగరం పేపర్ మిల్స్ రోడ్డుకు చెందిన శ్రీరామ్ (20) అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ ముగ్గురు ఆ ప్రాంతంలో రౌడీలుగా చెలామణి అవుతున్నట్టు తేలింది. దీంతో వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కావేరి హాస్పిటల్‌లో క్యాన్సర్‌కు కార్-టి సెల్ థెరఫీ



కార్-టి సెల్ థెరఫీ ప్రారంభోత్సవంలో వైద్యనిపుణులు

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో చెమరిక్ ఆన్టీజెన్ రెసిప్టర్ టి.సెల్ థెరఫీని ముంబయి టాటా మెమోరియల్ సెంటర్ మెడికల్ ఆంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మస్ముఖ్ జైన్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కావేరి హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అయ్యప్పన్ పొన్నుసామి మీడియాతో మాట్లాడుతూ క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి రోగనిరోధక కణాలను ఉపయోగించి ప్రయోగశాలలో వాటిని మార్పు చేసి మళ్లీ రోగి శరీరంలోకి చొప్పించినప్పుడు అవి క్యాన్సర్ కణాలను నశింపజేయడమే ఈ కార్-టి థెరఫీ ప్రత్యేక అంశమని చెప్పారు. ఈ థెరఫీ రాష్ట్ర ప్రజలకే కాకుండా పొరుగు రాష్ట్రాల్లో క్యాన్సర్ రోగులకు ప్రయోజనం కలగిస్తుందన్నారు.



సత్యరాజ్ - కాళీ వెంకట్ కాంబోలో

'మద్రాస్ మ్యాట్నీ'

సీనియర్ నటుడు సత్యరాజ్, కాళీ వెంకట్ కాంబినేషన్‌లో 'మద్రాస్ మ్యాట్నీ' అనే పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతుండగా, ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. మద్రాస్ మోషన్ పిక్చర్స్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ కలిసి మూవీ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. కార్తికేయన్ మణి దర్శకత్వం వహించిన ఈ మూవీలో సత్యరాజ్, కాళీ వెంకట్‌లతో పాటు రోషిణి హరి ప్రియన్, షెల్లీ, విశ్వ, జార్జ్ మరియన్, అర్చనా సందూక్, సునీల్ సుగదా, చామ్స్ తదితరులు నటించారు. తాజాగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ ఎంతగానో ఆకట్టుకుంటుండగా జూన్‌లో ప్రేక్షకుల ముందుకు చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

బాలీవుడ్‌పై రెజీనా దృష్టి

ఇటు తమిళం, అటు తెలుగు భాషా చిత్రాల్లో పెద్దగా అవకాశాలు రాకపోవడంతో హీరోయిన్ రెజీనా కసాండ్రా బాలీవుడ్‌పై దృష్టిసారించింది. తమిళంలో 'కండ నాల్ ముదల్' మూవీలో చిన్న పాత్రలో కోలీవుడ్ ప్రేక్షకులకు పరిచయమైన రెజీనా... ఆ తర్వాత 'కేడీ బిల్లా కిల్లాడీ రంగా', 'రాజతందిరం', 'మానగరం', 'శరవణన్ ఇరుక్క భయమేన్' వంటి పలు చిత్రాల్లో హీరోయిన్‌గా నటించారు. తెలుగులో అనేక చిత్రాల్లో నటించారు. అజిత్ నటించిన 'విడాముయర్చి', విశాల్ నటించిన చక్ర చిత్రాల్లో లేడీ విలన్ పాత్ర పోషించారు. ప్రస్తుతం సుందర్ దర్శకత్వంలో రూపొందుతోన్న 'మూక్కుత్తి అమ్మన్-2'లో అతి ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో హిందీలో ఆమె నటించిన 'జాత్', అగ్రహీరో అక్షయ్ కుమార్‌తో కలిసి నటించిన 'కేసరి-2' వంటి మూవీల్లో తనకంటూ కొంత ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. అలాగే, పలు బాలీవుడ్ ప్రాజెక్టులను దక్కించుకుంటూ బిజీగా మారిపోయారు. అదేసమయంలో దక్షిణాది చిత్రసీమలో వచ్చే అవకాశాలను కూడా ఆమె వదులుకోవడం లేదు.




రెజీనా కసాండ్రా

చిత్రజ్యోతి

దర్శకుడిగా మారిన లియో జాన్ పాల్

ప్రముఖ సినిమాటోగ్రాఫర్ లియో జాన్ పాల్ దర్శకుడిగా అవతారమెత్తారు. 'సూదుకవ్వుం', 'ఇంద్రు నేత్రు నాలై' వంటి చిత్రాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసి తన ప్రతిభ నిరూపించుకున్న ఆయన.. ఇపుడు మెగాఫోన్ పట్టారు. విజయ్ ఆంటోనీ హీరోగా మీరా విజయ్ ఆంటోనీ సమర్పణలో విజయ్ ఆంటోనీ ఫిలిమ్స్ కార్పొరేషన్ పతాకంపై 'మార్గన్' మూవీ తెరకెక్కించగా, జూన్ నెల 27వ తేదీ విడుదలకానుంది. గతంలో విడుదలైన ఈ మూవీ ఫస్ట్‌లుక్‌తో పాటు ఫస్ట్ సింగిల్‌కు మంచి స్పందన వచ్చింది. ఇందులో విజయ్ ఆంటోనీ చిన్నాన్న కుమారుడు అజయ్ దిషాన్ ప్రతినాయకుడి పాత్ర పోషించాడు. ఇందులో విజయ్ ఆంటోనీ, సముద్రఖని, మహానటి శంకర్, ప్రతిక, బ్రిగిడ, వినోద్ సాగర్, అజయ్ దిషాన్, దీప్షిక, కనిమొళి తదితరులు నటించారు.



లొకేషన్‌లో సూచనలిస్తున్న లియో



'థగ్‌లైఫ్'లో శింబు - కమల్ హాసన్

24న 'థగ్‌లైఫ్' ఆడియో గ్రాండ్ రిలీజ్

మణిరత్నం దర్శకత్వంలో అగ్ర నటుడు కమల్ హాసన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'థగ్‌లైఫ్'. జూన్ 5వ తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని శనివారం ఆ చిత్ర ట్రైలర్ రిలీజ్ చేయనున్నారు. అలాగే, ఆడియో రిలీజ్ వేడుకను ఈ నెల 24వ తేదీ సాయిరాం ఇంజనీరింగ్ కాలేజీలో భారీ స్థాయిలో నిర్వహించనున్నారు. నిజానికి ఈ నెల 16వ తేదీ శుక్రవారం ఈ వేడుక నిర్వహించాలని తొలుత భావించారు. కానీ, భారత్ - పాకిస్థాన్‌ల మధ్య జరిగిన సైనిక ఘర్షణ, సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్టు హీరో, నిర్మాత కమల్ హాసన్ ప్రకటించారు. కాగా ప్రస్తుతం పరిస్థితులు చక్కబడటంతో ఈ మూవీ ఆడియో రిలీజ్ వేడుకను ఈ నెల 24వ తేదీ, ట్రైలర్ 17వ తేదీ సాయంత్రం 5 గంటలకు విడుదల చేయనున్నట్టు రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ (ఆర్‌కేఎఫ్‌ఐ) విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆడియో రిలీజ్ వేడుక సందర్భంగా అకాడెమీ అవార్డు గ్రహీత ఏఆర్.రెహ్మాన్ బృందం లైవ్ సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించనుంది. కాగా, ఆర్‌కేఎఫ్‌ఐ, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించగా, ఏఆర్ రెహ్మాన్ సంగీతం సమకూర్చారు. శింబు, త్రిష, జోజు జార్జ్, అశోక్ సెల్వన్, అభిరామి ప్రధాన పాత్రలను పోషించారు.



పుష్ప ప్రదర్శనను ప్రారంభిస్తున్న సీఎం

ప్రకృతి అందాలకు నెలవు... వివిధ రకాలైన విరులకు నిలయం... చుట్టూ పచ్చని చెట్లు... విరబూసిన పుష్పాలు... సందర్శకులకు అమితానందం కలిగించే ప్రాంగణం... ఇలా ఎన్ని చెప్పుకున్నా ఊటీకి మరేది సాటిరాదు. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పర్యాటక ప్రాంతం, పర్వత రాణి ఊటీలో రోజాలు విరబూసాయి. బొటానికల్ గార్డెన్‌లో 127వ పుష్ప ప్రదర్శన గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది.

ఎన్నెన్నో వర్ణాలు....



హంస పడవలో రాకుమారి





ఫిరంగి

అన్నింటా అందాలు....

- ఊటీలో విరబూసిన రోజా వనం
- ప్రారంభమైన పూల ప్రదర్శన



కరికాలచక్రవర్తి, కల్లనైడ్యామ్

చెన్నై, ఆంధ్రజ్యోతి

ఈ యేడాది ఈ ఫ్లవర్‌షోలో ప్రాచీన కాలపు తమిళ రాజుల కీర్తి ప్రతిష్ఠతను ఎలుగెత్తి చాటేలా పూలతో వివిధ రకాల సెట్టింగ్‌లు తీర్చిదిద్దారు. చిన్నారులను ఆకట్టుకునేలా 70 అడుగుల పొడవు, 20 అడుగుల ఎత్తు కలిగిన బ్రహ్మాండమైన అంతఃపురం సెట్టింగ్, లక్షా 30 వేల పూలతో ప్రవేశద్వారం, 75 అడుగుల పొడవు, 25 అడుగుల ఎత్తున కార్నేశన్, రోజా, చామంతి వంటి 2 లక్షల పూలతో రాయల్ కెస్టెల్ రాజుల కాలం నాటి అంతఃపురం సెట్టింగ్ ఏర్పాటు చేశారు. ఇక ఎనిమిది అడుగుల ఎత్తు, 35 అడుగుల పొడవు 50,400 పూలతో తయారైన హంస సందర్శకులను బాగా ఆకట్టుకుంటోంది. ఇవి కాకుండా ఆ ఉద్యానవనమంతా వివిధ ప్రాంతాల్లో పూలతో అలంకరించిన రాజుల కాలం నాటి సింహాసనం, ఊయల, అద్దం, సంగీత వాద్యపరికరాలు, ఫిరంగి, ఏనుగు, పులి, సహస్రాకారం వంటి పూల అలంకరణలు సైతం చూపరులను ఆకట్టుకుంటున్నాయి.





విల్లంబులు - పట్టపుటేనుగు, మావటీలు





పుష్పాలను తిలకిస్తున్న సందర్శకులు - పుష్ప ప్రదర్శనలో సీఎం దంపతులు, మంత్రులు, ఉన్నతాధికారులు

వైభవంగా గంగమ్మ శిరస్సు ఊరేగింపు

వేలూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తం గోపాలపురం కౌండిన్య నది ఒడ్డున వెలసిన గంగమ్మ శిరస్సు ఊరేగింపు గురువారం వైభవంగా జరిగింది. వేడుకల సందర్భంగా తెల్లవారుజామున 4 గంటలకు గర్భాలయలోని గంగమ్మకు ప్రత్యేక అభిషేకం, విశేషిలంకరణ, మహా దీపారాధన నిర్వహించారు. ఉదయం 6 గంటలకు అమ్మవారి శిరస్సు ఊరేగింపు ప్రారంభమైంది. గుడియాత్తం ధర్మాంపేటలోని ముత్యాలమ్మ ఆలయం నుంచి శిరస్సును ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఊరేగింపులో సిలంబాట్టం, నెమలి ఆట్టం, పులి వేషం, గరగాట్టం, మేళతాళాలతో కళాకారులు సందడి చేశారు. నడుపేట, గాంధీ రోడ్డు, నెహ్రూ వీధుల మీదుగా సాగిన ఊరేగింపు గంగమ్మ ఆలయానికి చేరుకుంది. ఊరేగింపు సాగిన మార్గాల్లో భక్తులు హారతులిచ్చి, కొబ్బరికాయలు కొడుతూ అమ్మవారికి స్వాగతం పలికారు. ఆలయానికి ఊరేగింపు చేరిన అనంతరం చండాలక్ష్మి అమ్మవారి శరీరంపై శిరస్సు ఉంచి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారు నేత్రాలు తెరిచే వేడుకలను వీక్షించిన భక్తులు పులకించిపోయారు. ఈ వేడుకల్లో రాష్ట్రంతో పాటు ఆంధ్ర, కర్ణాటక సహా పలు రాష్ట్రాలకు చెందిన సుమారు 5 లక్షల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఈ వేడుకల సందర్భంగా రాష్ట్ర రవాణా సంస్థ వేలూరు, రాణిపేట, తిరుపత్తూర్, తిరువణ్ణామలై, చిత్తూరు, బెంగళూరు సహా పలు నగరాల నుంచి 500 ప్రత్యేక బస్సులు నడిపింది.





చండాలక్ష్మికి శిరస్సు ఉంచిన దృశ్యం (ఇన్‌సెట్‌లో) - గంగమ్మ శిరస్సు ఊరేగింపులో భక్తులు

కామాక్షి ఆలయంలో సెల్‌ఫోన్ నిషేధం

- అందుబాటులోకి డిజిటల్ లాకర్

వాషర్‌మెన్‌పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వుల మేరకు, కాంచీపురం కామాక్షి అమ్మవారి ఆలయం లోనికి భక్తులు సెల్‌ఫోన్ తీసుకెళ్లడంపై నిషేధం విధించారు. భక్తులు తమ సెల్‌ఫోన్ భద్రపరచుకొనేలా 'డిజిటల్ లాకర్' సదుపాయం కల్పించారు. ఈ విషయమై ఆలయ అధికారులు మాట్లాడుతూ... ఆలయాల్లోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లరాదని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసిందన్నారు.ఆ ప్రకారం,కామాక్షి అమ్మవారి ఆలయంలోకి సెల్‌ఫోన్ తీసుకెళ్లడంపై నిషేధం విధించామన్నారు. భక్తులు తమ సెల్‌ఫోన్ భద్రపరచుకొనేలా డిజిటల్ లాకర్ వసతి కల్పించామని తెలిపారు. ఆలయ తూర్పు, ఉత్తరం ప్రవేశ ద్వారం సమీపంలో ఏర్పాటుచేసిన డిజిటల్ లాకర్‌పై ఉన్న క్యూ ఆర్ కోడ్ తమ సెల్‌ఫోన్ ద్వారా స్కాన్ చేసి, తమ సెల్‌ఫోన్‌కు వచ్చే నాలుగు అంకెల పాస్‌వర్డ్ గుర్తుపెట్టుకొని, లాకర్‌లో సెల్‌ఫోన్ ఉంచి ఆలయం లోపలికి వెళ్లాలన్నారు. దర్శనం ముగిసిన అనంతరం లాకర్‌పై స్క్రీన్‌పై నాలుగు అంకెల పాస్ వర్డ్ నమోదుచేసి సెల్‌ఫోన్ తీసుకెళ్లవచ్చని తెలిపారు. డిజిటల్ లాకర్‌లో సెల్‌ఫోన్ ఉంచేందుకు భక్తులు క్యూఆర్ కోడ్ ద్వారా రూ.10 చెల్లించాల్సి ఉంటుందని, ఒకే సమయంలో 1,000 మంది వరకు ఈ సదుపాయం వినియోగించేలా డిజిటల్ లాకర్స్ ఏర్పాటుచేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.



అమ్మవారి ఆలయంలో ఏర్పాటుచేసిన డిజిటల్ లాకర్లు



కళాకారులతో అతిథులు, నిర్వాహకులు

అలరించిన నృత్య ప్రదర్శనలు

వాషర్‌మెన్‌పేట, మే 15 (ఆంధ్రజ్యోతి): భారత్ కళా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భరత నాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించాయి. తంజావూరులోని ప్రసిద్ధి చెందిన బృహదీశ్వరాలయం లో 'చిత్ర పౌర్ణమి కలై విళా-2025' పేరుతో ఈ ప్రదర్శన జరిగింది. అకాడమీ వ్యవస్థాపక డైరెక్టర్, గురుదు రోజా రాణి, అకాడమీ డైరెక్టర్, ఆర్గనైజర్ దుర్గా నటరాజన్ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రదర్శనలకు ముఖ్యఅతిథులుగా తంజావూరు 13వ రాజు బాబాజీ రాజా బోస్లే, తమిళనాడు యూనివర్శిటీ తంజావూరు వ్యవస్థాపక ఛైర్మన్ భాస్కరన్, శివసేన స్టేట్ ఎగ్జిక్యూటివ్ శశికుమార్ హాజరయ్యారు. ప్రదర్శనలో బెంగళూరుకు చెందిన శివప్రియా బృందం భరత నాట్యం, కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. అలాగే, తంజావూరు, తొరైపాక్కం సహా పలు బృందాలు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులకు ముఖ్య అతిథులు, నిర్వాహకులు జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

'సిమ్స్'లో 92 యేళ్ల వైద్యుడికి అరుదైన హృద్రోగ శస్త్రచికిత్స

చెన్నై, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని లోని సిమ్స్ ఆస్పత్రిలో నగరానికి చెందిన సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీవత్సన్ (92)కు అరుదైన హృద్రోగ శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆ ఆస్పత్రి హృద్రోగ శస్త్రచికిత్సా నిపుణుడు డాక్టర్ వీవీ బాషి తెలిపారు. గురువారం మధ్యాహ్నం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకే సమయంలో బైపాస్ సర్జరీ, పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ అసాధారణమైన ఆపరేషన్ తర్వాత రోగి వారం రోజులకే సంపూర్ణంగా కోలుకుని డిశ్చార్జ్ అయినట్లు చెప్పారు.సాధారణంగా ఇలాంటి ఆపరేషన్లను గుండె స్పందన నిలిపివేసి, కృత్రిమ స్పందన పరికరాన్ని అమర్చి చేస్తుంటారని, అయితే డాక్టర్ శ్రీవత్సన్‌కు బీటింగ్ హార్ట్ కరోనరీ బైపాస్ సర్జరీ విజయవతంగా నిర్వహించామని చెప్పారు.రోగి 90 యేళ్లుదాటినా వృత్తిరీత్యా డాక్టర్ కావడం, ఆపరేషన్‌కు మానసికంగా సిద్ధం కావటం వలన ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆపరేషన్ చేయగలిగామని చెప్పారు. మీడియా సమావేశంలో సిమ్స్ హాస్పిటల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజు శివసామి, డాక్టర్ మహమ్మద్ ఇదీహ్ తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ చేసుకున్న డాక్టర్ శ్రీవత్సన్‌తో డాక్టర్ వీవీ బాషి, డాక్టర్ రాజు శివసామి, తదితరులు

వేళచ్చేరిలో చెన్నై-147 స్పోర్ట్స్ అకాడమీ

- ప్రారంభించిన మేఘనాథ రెడ్డి

ప్యారీస్, మే 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి విజయ్ నగర్‌లో ఏర్పాటుచేసిన చెన్నై-147 స్పోర్ట్స్ అకాడమీని రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథ రెడ్డి ప్రారంభించారు. స్నూకర్ క్రీడాకారుల కోసం ఆధునిక వసతులతో నిర్మించిన ఈ అకాడమీ ప్రారంభోత్సవంలో భారత తొలి స్నూకర్ ఛాంపియన్ సీనా ప్రవీణ్ ఆత్మీయ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేఘనాథరెడ్డి మాట్లాడుతూ... క్రీడల్లో ప్రతిభ కనపరచి రికార్డులు సాధించిన క్రీడాకారులు మళ్లీ క్రీడా సంస్థకు తమవంతు సహకారం అందించాలని, యువతను ప్రతిభ కలిగిన క్రీడాకారులను తీర్చిదిద్దాలని కోరారు. నాలుగేళ్లలో 4,600 మంది క్రీడాకారులకు ప్రోత్సాహక నిధిగా రూ.160 కోట్లు అందజేసినట్లు మేఘనాథ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుంచల, డా.సీఎస్ స్వామి, నిషిత సుంకల, ఎల్.సుజాత తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభిస్తున్న మేఘనాథ రెడ్డి

సేలం జిల్లా ఏర్కాడు వద్ద 'ఇళ్లవద్దకే వైద్యం' గురించి ప్రజల వద్ద వాకబు చేస్తున్న ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం



చెన్నై విల్లివాక్కం న్యూఆవడి రోడ్డు తిరునగర్ పార్కులో రూ.90లక్షలతో నిర్మించనున్న మహిళా వ్యాయామ శాలకు భూమి పూజ చేస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు, మేయర్ ప్రియ





కాలినడక మార్గంలో పట్టుబడిన పాము

అలిపిరి నుంచి తిరుమలకు చేరుకునే కాలినడకమార్గంలోని ఏడోమైలు వద్ద గురువారం సుమారు ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతు పాము పట్టుబడింది. ఆంజనేయస్వామి విగ్రహానికి సమీపంలోని జనరేటర్ గదిలోకి జెర్రిపోతు పాము ప్రవేశించడాన్ని సిబ్బంది గుర్తించి పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. అనంతరం దట్టమైన అడవిలో విడిచిపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

విల్లుపురం-తిరుపతి ఎక్స్‌ప్రెస్ పాక్షిక రద్దు

మరమ్మతుల కారణంగా విల్లుపురం-తిరుపతి మధ్య నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలు పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. ఈ మేరకు తిరుచ్చి రైల్వే డివిజన్ కార్యాలయం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... దక్షిణ మధ్య రైల్వే అధ్వర్యంలో గుంతకల్ డివిజన్ పరిధిలో పలు విభాగాల్లో మరమ్మతులు జరుగుతున్నాయని, అందువల్ల విల్లుపురం-తిరుపతి మధ్య నడుపుతున్న రైలు వేళల్లో మార్పు చేసినట్లు తెలిపింది. విల్లుపురం నుంచి ఉదయం 5.40 గంటలకు బయల్దేరే ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18,20,21,22,25,27,28,29, జూన్ 1,3 తేదీల్లో తిరుపతికి బదులు కాట్పాడి వరకు మాత్రమే నడుస్తుంది. అలాగే, మరుమార్గంలో తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు విల్లుపురం వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతికి బదులు కాట్పాడి నుంచి బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.

- ప్యారీస్, ఆంధ్రజ్యోతి

గరుడ వారధికి లోడ్ టెస్ట్

తిరుపతిలోని గరుడ వారధికి ఇటీవల జరిగిన మరమ్మతుల నేపథ్యంలో లోడ్ టెస్ట్ చేయనున్నారు. రామానుజ సర్కిల్ నుంచి శ్రీనివాసం వరకు.. శుక్రవారం నుంచి 21వ తేది వరకు 'స్పాన్ లోడ్ టెస్ట్' ఉంటుంది. ఆ సమయంలో రాకపోకలను నిలిపివేస్తున్నట్టు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఒక ప్రకటనలో తెలిపారు. కపిలతీర్థం నుంచి వచ్చే వాహనాలు శ్రీనివాసం కాంప్లెక్స్ వరకు వారధిపై రావచ్చని, అదేవిధంగా మార్కెట్ యార్డు టూ రేణిగుంటకు రాకపోకలు చేయవచ్చని పేర్కొన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ నారాయణగిరి షెడ్ల వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.27 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 74,020

తలనీలాలు సమర్పించినవారు: 29,361



కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లోనూ చదవాలనే పేద పిల్లల ఆకాంక్షను నెరవేర్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 428 కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఇందుకోసం 25 శాతం సీట్లు కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రమంలో 1వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీరి ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. అయినప్పటికీ మూడేళ్లుగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న వారి సంఖ్య తక్కువగానే ఉంటోంది. ప్రచారం,అవగాహనారాహిత్యమే ఇందుకు కారణమని ప్రభుత్వం గుర్తించింది. ఈక్రమంలోనే ఈసారి దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించింది.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

గతంలో ప్రవేశాలు పొందిన వారు

సంవత్సరం	అడ్మిషన్ల సంఖ్య
1. 2022	57
2. 2023	1002
3. 2024	97



పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్ విద్య

ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు

1వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రభుత్వమే ఫీజుల చెల్లింపు

వీరు అర్హులు: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద కుంటుంబాల పిల్లలు అర్హులు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారయితే కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలలోపు పట్టణ ప్రాంతాలయితే రూ.1.44 లక్షలలోపు ఉండాలి. పాఠశాల నుంచి మూడు కిలోమీటర్ల లోపు దూరంలో ఉన్నవారే దరఖాస్తు చేసుకోవాలి. ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో చేరదలచుకున్న పిల్లలకు ఈ ఏడాది మార్చి 31 నాటికి ఐదేళ్ల వయసు నిండాలి. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో చేరేవారికి మే 31 నాటికి ఐదేళ్లు నిండాలి.

అడ్మిషన్లకు ఎంపిక

దరఖాస్తులను ఈనెల 20 నుంచి 24 వరకు పరిశీలిస్తారు. 29న లాటరీ విధానంలో ఎంపిక చేసి మొదటి జాబితాను ప్రకటిస్తారు. వీరి ప్రవేశాలను జూన్ 8న నిర్ధారిస్తారు. జూన్ 11న లాటరీ ద్వారా రెండో దశ జాబితాను కూడా ప్రకటిస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాల్లో ఉచితంగా చేరవచ్చు.

సీట్ల కేటాయింపు ఇలా ఉంటుంది

దివ్యాంగులు, హెచ్ఐవీ బాధితులు, అనాథలకు 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, సూచించిన పరిమితి లోపు ఆదాయం ఉన్న బలహీన వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లను కేటాయిస్తారు. ఆయా రిజర్వేషన్లలో పిల్లలు లేకపోతే ఆ సీట్లను ఇతరులకు కేటాయిస్తారు. సందేహాలకు, సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబరు 1800 425 8599లో సంప్రదించవచ్చు.

దరఖాస్తు విధానం

దరఖాస్తుల ప్రక్రియ పారంభమైంది. అర్హులైన విద్యార్థులు ఈ నెల 19వ తేదీలోపు పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ https://cse.ap.gov.in/ ద్వారా ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతో పాటు ప్రస్తుత చిరునామా ధ్రువీకరణకు ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్‌కార్డు, భూమి హక్కుల పత్రం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యుత్ బిల్లు, అద్దె ఒప్పంద పత్రాల్లో ఏదేని ఒకటి సమర్పించాల్సి ఉంటుంది. బర్త్ సర్టిఫికేట్ తప్పనిసరి.



పోలీసుల అదుపులో నిందితులు - స్వాధీనం చేసుకున్న గంజాయి

24.5 కిలోల గంజాయి స్వాధీనం

● **ఇద్దరు పశ్చిమబెంగాల్ మహిళల అరెస్టు**

రేణిగుంట, మే 15 (ఆంధ్రజ్యోతి): రేణిగుంటలోని ఓ లాడ్జీలో 24.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో గదిని పోలీసులు తనిఖీలు చేశారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన మామోని మండల్, నమిత మండల్ సూట్‌కేసులను చూడగా.. 24.5 కేజీల గంజాయి ఉంది. దీనిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు. ఒడిశాలో గంజాయి కొని కేరళకు తరలించే క్రమంలో ఇక్కడి గదిలో దిగారు. గంజాయి తరలింపులో కీలకంగా వ్యవహరిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేయాల్సి ఉంది' అని ఏఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ అరుణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

11 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులు



పదోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న యూనియన్ నాయకులు

తిరుపతి(నేరవిభాగం), మే 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 11మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు ఎక్సైజ్ ఈఎస్, నోడల్ అధికారి శ్రీనివాసులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో వి.కోట చెక్‌పోస్టులో పనిచేస్తున్న సి.రామన్, కె.ప్రభాకర్(చీకలబైలు), బి.హిదయతుల్లా (ఈఎస్ కంట్రోలు రూమ్), రమేష్‌బాబు (ఏసీ డిస్టిలరీలు), వి.లోకేష్ (రామసముద్రం సీపీ), ఇస్మాయిల్ (పలమనేరు), వైకుంఠరావు (కేటల్‌పొరం), ప్రవీణ్‌కుమార్ (ఏసీ ఎన్‌ఫోర్సుమెంటు), ఉమామహేశ్వర (పీలేరు), శ్రీనివాస్ (చిత్తూరు), మధుసూదనరెడ్డి (మదనపల్లె) ఉన్నారు. పదోన్నతులు పొందిన వారిని జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంఘం అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ యాదవ్, ఉపాధ్యక్షుడు హరిప్రసాద్, గౌరవాధ్యక్షుడు ధర్మయ్య, ప్రెస్ కార్యదర్శి రమేష్ అభినందించారు.

తిరుపతి ఐఐటీకి మహర్దశ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, మే 15(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2,313 కోట్లతో తిరుపతి ఐఐటీకి మహర్దశ రానుందని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణచెప్పారు. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో గురువారం ఆయన ఇతర అధికారులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఐఐటీకి 2015లో ప్రభుత్వం 549 ఎకరాలు ఇచ్చిందన్నారు. మొదటి విడతగా కేంద్రం ఇచ్చిన రూ.1,444 కోట్లతో 1,200 మంది విద్యార్థులకు సౌకర్యాలు కల్పించామన్నారు. ఇప్పుడు రెండో విడత కింద అభివృద్ధి చేయడానికి కేంద్రం 2,313 కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో నాలుగేళ్ల కాల వ్యవధిలో 6,500మంది విద్యార్థులకు సౌకర్యంగా తరగతి గదులు, హాస్టల్ భవనాలు, ల్యాబ్ మొదలగు వసతులను ఏర్పాటు చేస్తామన్నారు. 12వేలమంది విద్యార్థులకు వసతులు కల్పించడానికి మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు వివరించారు. రెండో విడత కింద.. నాలుగేళ్ల వ్యవధిలో ఎంతెంత ఖర్చు చేయనున్నారు? ఏయే వసతులు కల్పించనున్నారనే వివరాలను ఆయన వెల్లడించారు. ఇలా ఫేజ్ 1, ఫేజ్ 2 కింద నిర్మాణాలను పూర్తిచేసి రానున్న రోజుల్లో 12వేలమంది విద్యార్థులకు సౌకర్యంగా ఐఐటీని తీర్చిదిద్ది అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లనున్నట్లు డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. కియా మోటార్, టాటా కంపెనీలు, అమరరాజా, నవయుగ కన్‌స్ట్రక్షన్స్‌తోపాటు మరిన్ని కంపెనీలతో కలిసి తిరుపతి ఐఐటీ పనిచేస్తోందన్నారు. నాలుగేళ్ల పాటు తిరుపతి ఐఐటీలో కియా మోటార్స్ రూ.35కోట్లతో ఇంజనీరింగ్ ఎక్సలెన్సును పెంపొందించడం, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఇంజనీరింగ్ రంగాల్లో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుని ఒప్పందాన్ని కుదుర్చుకుని పనిచేస్తోందన్నారు. ఈ ఎంవోయూలో విద్యార్థుల కోసం ప్రీ ప్లేస్‌మెంట్, ఆఫర్లతో అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఎంటెక్ విద్యార్థులకు ప్రత్యేకంగా కియా ఇండియా స్కాలర్‌షిప్ రూపంలో ఆర్థిక సాయం అందిస్తామని ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ చెప్పారు.

వీడిన చిన్నారి హత్యాచారం కేసు మిస్టరీ

● **17 నెలల తర్వాత పట్టుబడిన నిందితుడు**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

చంద్రగిరి, మే 15(ఆంధ్రజ్యోతి): దాదాపు ఏడాదిన్నర క్రితం జరిగిన మైనర్ బాలిక హత్యాచారం కేసు మిస్టరీ వీడింది. నిందితుడిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం డీఎస్పీ ప్రసాద్ విలేకర్ల సమావేశంలో వెల్లడించిన వివరాలివి.. 2023 డిసెంబరులో చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె జగనన్న కాలనీలో సిమెంటు ఇటుకల తయారీకి జార్ఖండ్ నుంచి కొంతమంది కార్మికులు వచ్చారు. ఈక్రమంలో గతేడాది జనవరి 3న ఈ కార్మికుల్లో ఒకరి కుమార్తె (6) ఇటుకల బట్టీ వద్ద ఆడుకుంటోంది. తర్వాత కనిపించలేదు. దీంతో తల్లిదండ్రులు పరిసరాల్లో గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమతో వచ్చిన బాల్ కిషోర్ ఖెర్వార్‌ను బాధిత బాలిక తల్లిదండ్రులు అనుమానించారు. అతడిని కొట్టి పోలీసులకు అప్పగించారు. పోలీసులు విచారించి బాల్‌కిషోర్‌ను విడిచిపెట్టారు. తర్వాత అతడు కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యాడు. తప్పిపోయిన బాలిక మృతదేహం నాలుగు రోజుల తర్వాత జగనన్న కాలనీ సమీపంలో అటవీ ప్రాంతంలో బయటపడింది. పోలీసుల నిర్లక్ష్యం వల్లే బాల్‌కిషోర్ చేతిలో బాలిక హత్యకు గురైందంటూ అప్పట్లో బాధితురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేశారు. పోలీసులు తొలుత అనుమానాస్పద కేసుగా నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక హత్య కేసుగా నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో ఇటీవల కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. 17 నెలల తరువాత గురువారం తిరుపతి రైల్వే స్టేషన్ సమీపంలో బాల్ కిషోర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. చిన్నారికి తినుబండారాలిచ్చి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాక హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. ఇతడ్ని కోర్టుకు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐలు రవీంద్రనాయక్, అనిత, సిబ్బంది మునిరత్నం, పురందర్, గోపి, లోకనాథం తదితరులు పాల్గొన్నారు. కేసును చేదించిన ఎస్ఐలు రవీంద్రనాయక్, అనిత, సిబ్బంది మునిరత్నం, పురంధర్, గోపి, లోకనాథంలకు డిఎస్పీ ప్రసాద్, సీఐ సుబ్బరామిరెడ్డి చేతుల మీదుగా రివార్డులను అందజేశారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ నిర్వహణ భేష్

పరిశీలించిన 16వ ఆర్థిక కమిషన్ బృందం



వేస్ట్ మేనేజ్‌మెంట్ వివరాలు తెలుసుకుంటున్న ఆర్థిక కమిషన్ సభ్యులు

తిరుపతి/రేణిగుంట, మే15(ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తూకివాకంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ బాగుందని 16వ ఆర్థిక కమిషన్ సభ్యులు సౌమ్య కాంతి ఘోష్ అన్నారు. గురువారం ప్లాంట్ (చెత్త నుండి సంపద కేంద్రం)ను కలెక్టర్ వెంకటేశ్వర్, కార్పొరేషన్ కమిషనర్ మౌర్యతో కలిసి కమిషన్ సభ్యులు సౌమ్య కాంతి ఘోష్, కార్యదర్శి గౌతమ్ అల్లాడ పరిశీలించారు. ప్లాంట్‌లో ఘన వ్యర్థాల నిర్వహణ, కంపోస్టు తయారీ, బయో మెథనైజేషన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల గురించి కలెక్టర్, కమిషనర్ మౌర్య వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తదితరాలను ప్రాసెసింగ్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారని, తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తారని, ఇక మార్కెట్ నుంచి వెలువడే, హోటల్స్ నుంచి సేకరించే వ్యర్థాల ద్వారా వంట గ్యాస్ ఉత్పత్తి చేసి విక్రయిస్తున్నట్లు వివరించారు. భవన నిర్మాణ వ్యర్థాలను ఆరు రకాలుగా గుల్ల, ఇసుకగా మారుస్తారని, దాంతో పేవర్స్ తయారు చేస్తారని తెలిపారు. ట్రీటెడ్ వేస్ట్ నీటిని పరిశ్రమలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, లైజన్ అధికారులు పాల్గొన్నారు.



ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



ప్రత్యేకాలం కరణలో గురుదక్షిణా మూర్తి

శ్రీకాళహస్తి, మే 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మేధో గురుదక్షిణామూర్తికి గురువారం గురుపేచి సందర్భంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. దక్షిణామూర్తికి అభిషేకం చేశాక, విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ కుమార్‌నాయుడు, చెంచయ్యానాయుడు, ప్రధానార్చకులు కరుణాకరన్ గురుకుల్, వేదపండితులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కురుగొండలో ఎమ్మెల్యే పల్లెనిద్ర

● **అభివృద్ధి పనులను ప్రారంభించిన నెలవల విజయశ్రీ**



అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

ఓజిలి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండలో గురువారం రాత్రి సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పల్లె నిద్ర చేశారు. గ్రామాల్లో పరిస్థితి, ప్రభుత్వం పట్ల ప్రజలకున్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు పల్లె నిద్ర చేయాలని ప్రజా ప్రతినిధులను, అధికారులకు ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు సూళ్లూరుపేట నియోజకవర్గంలో మొట్టమొదటి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, రూ.40 లక్షలతో చేపట్టిన జలజీవన్ మిషన్, మినీ గోకులం షెడ్లను ప్రారంభించారు. అనంతరం ర్యాలీగా సభావేదిక వద్దకు చేరుకున్నారు. ఇది సీఎం చంద్రబాబు ఆశీస్సులతో దక్కిన ప్రజా విజయమని.. తాను ప్రజా సేవకే అకింతమవుతానని పేర్కొన్నారు. తనను గెలిపించిన ప్రజలకు సేవ చేస్తూ వారి రుణం తీర్చుకుంటానన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఇప్పటికే సీసీ రోడ్లు తాగునీరు, డ్రైనేజి వ్యవస్థ తదితర సదుపాయాలను కల్పించామని వెల్లడించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో విజయలక్ష్మీ, ఎంఈవో-2 చంద్రశేఖర్, ఏవో విజయలక్ష్మి, ఓజిలి, పెళ్లకూరు మండలాల పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌నాయుడు, సంచి కృష్ణయ్య, నేతలు శ్రీనివాసులురెడ్డి, నిరంజన్, పాడి వెంకటసుబ్బయ్య, ఎస్కే ఖలీల్, గున్నం మధుసూదన్‌రెడ్డి, కనుమూరు గోపాల్‌రెడ్డి, దారా అంకయ్య, కంకణాల సత్యవరప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అత్యుత్సాహంతో జనాలకు ఇక్కట్లు

ఎమ్మెల్యే పల్లెనిద్ర సందర్భంగా కొందరు అధికారుల అత్యుత్సాహం జనాలను ఇబ్బంది పెట్టించింది. కురుగొండలో వేదిక ఏర్పాట్లు చేపట్టారు. దీంతో మధ్యాహ్నం నుంచే గ్రామంలోకి రాకపోకలను ఆపేసి బ్యారికేడ్లు అడ్డుపెట్టారు. దీంతో కురుగొండ మీదుగా గునపాటిపాళెం, గునపాడు, మెట్టు గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. టీడీపీ పాలనలో ఎప్పుడూ లేనివిధంగా ఇలా ఎమ్మెల్యే కార్యక్రమానికి రాకపోకలను ఆపేయడం ఏమిటని స్థానికులు తెలిపారు. బస్సులు, ఆటోలు బయటే తిరిగాయి. ద్విచక్ర వాహనదారులు మాత్రం సందుగొందుల్లో గ్రామంలోకి వెళ్లారు. ఈ పరిణామం పట్ల స్థానిక తెలుగుదేశం శ్రేణులు విస్మయం వ్యక్తంచేశాయి. ఇకనైనా అధికారులు ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా ప్రభుత్వ కార్యక్రమాలు కొనసాగించాల్సిన అవసరం ఉంది.



గ్రామంలోకి వెళ్లకుండా బ్యారికేడ్లు అడ్డం పెట్టడంతో ఆగిన ద్విచక్ర వాహనదారులు